త్రాసుపాము

గులపాదు వూగెలుపల గెడక్రలకి మళ్లేకిక్కిరిసి నిలబడుండ తాడితోపు మయాన నాగుమల్లె, సువ్వాకి మళ్లేపాం పుట్టల కాడ పాకుతుంటే బసవాయిని గొల్లమందకాడ పేడకొచ్చిన ఎంకాయిదూరాన్నుంచి సూసుద్ది.

ఆ బసవాయి గిరజాలు అప్పుడే తెలుస్తాయి. ఆడిమెళ్లో ఎండికంటె పదామడ దూరాన్నుండా తెలుత్తానే వుంటది. గెట్టిగా పంచ బిగట్టి నడుంకు ఆవ జానకట్టు బిగించేది వాడే. వాడి మెత్తాడుకు అయిదుగజ్జలు, రెండునల్లకుచ్చులు ఏళ్లాడేది కూడా ఎంకాయికి బాగా తెల్సు.

అయితే యీడ కాకుండ ఎంకాయికి ఆడ పాంపుట్టలకాడ తచ్చాడ్తుండ బసవాయి అసలేంచేత్తుండదీ తెలవటం బహు కష్టం. అయినా ఎప్పుడుసూసినా ఏ ఎండ్రకాయ బొక్కల కాడో గెడ్డలు తీసుకుని నిలబడ్తావుండేవోడు యియ్యాల వుండట్టుండి సాటుసాట్నుఆ పాంపుట్టలకాడ తిరగాల్నొచ్చిన పనేంది? ఆడ జనం ఎవురూ లేరుగందా? ఎంకాయి మదన్లోపడ్డది.

గొడ్డమంద గెనువుఎంట, నీలగుంటలకాడ ఆటిదార్ని అవి తల లొంచుకుని తిరుగాడ్తుంటే మందపిల్లకాయలు బిల్లంగోడు ఆడుకుంటావుండారు. అటేటుసూసి తోపులోకి సల్లంగా జారబడ్డది పేడపళ్లికతో ఎంకాయి.

అంత పట్టపగలయినా తాడితోపులోకి ఎళ్లేతలికి గలగలమంటా దగ్గిరదగ్గిరగా వాలేసుకుండ ఆ తాడిసెట్ల నీడలు బూమ్మీన పడి కరవొచ్చేజడల దెయ్యాలకి మల్లే వుంటంఅటుంచి ఏ బొక్కల్లోంచి ఎసువంటి జీవాలు తొంగిసూత్తావుంటయ్యో ఎసువంటి మడిసి కయినా తెలవటం బాహు కష్టం.

అడుగులు జారకుండా, చుట్టుపక్కల భద్రంగా సూసుకుంటా వొచ్చి బసవాయికి కాత్తవనకన నిలబడ్డది ఎంకాయి. ఆడ బసవాయి వాలకం, అసలు ఆడేంచేత్తుండదీ ముంగలయితే ఎంకాయికి అంతుబట్టలా. ఓ సేతిలో చెంచోళ్ల పాంకర్రా, రెండో సేతిలో గొబ్బిరిసిప్పా పట్టుకుని కోటయకొండ పెబకుమల్లేవుండ ఆ పుట్టపక్కన మోకాళ్లమీన వొంగి నిక్కి సూత్తుండ బసవాయిని చూసి కూసేపు అటనే నోరుదెరిసింది ఎంకాయి.

మెదులు ఎవురన్నా మాటల మయాన

(26-వ పేజీ చూడండి)

తాసుపాము

(8-వ పేజీ తరువాయి)

పాములంటుంటేనే వొళ్లుగగురిపొడుసుద్ది. అసువంటిది అసలవి నిజంగానే పొండుకునే అంతలావు పుట్టా, అన్ని బొక్కలకాడ-ఎచ్చగా లోనుంచి ఆవిరి కొడ్తుంటే- ఏ మడిసయినా ఆవజాన ఆడ వొంగి తొంగి సూత్తుంటం ఏ ఆడగూతురు కయినా ఎట్టుంటద్దీ?

"ఒరేయ్?-" అని గుటక మింగింది ఎంకాయి.

నిశిరేత్రి, నిదట్లో ఎవురయినా వీడు సముంద్రాలుదాటి, మూడుపుల్లి ఏటుకు నరికి, కుప్పేసి, నాలుగోఅడివి మయానుండ మర్రిసెట్టు తొర్రకాడ నిలబడి అరవకుండా తొంగి సూత్తుండే యవదానంలో- గబిక్కన యీపుమీన పెట్టమని సరిచి నిటారుగా కూకోబెట్టి నిదర్లేపితే ఎట్టుంటదో అట్టయి పోయి- గబిక్కన ఎనిక్కి ఒక్కగెంతేసి నిలబడి ఎంకాయిని సూశాడు బసవాయి.

"ఆఁయ్-?" అన్నాడు బసవాయి నోరు దెరిసి.

పళ్లిక నెత్తిన బెట్టుకుని, కోక పైకెగ్గట్టి, ఆవజాన నోరు దెరుసుకు సూత్తుంటే ఆ మడిసి గంగానమ్మతల్లనుకుంటు బసవాయికి యింకా స్సేపటికిగాని ఏంకాయి ఎంకాయికి మల్లే అగుపించలా.

మొన్నీమధ్య బెచ్చాలాట్లో తేలు కొండేజతో ఎగిరన్న ఎంకాయి వుండట్టుండి కోకెగ్గట్టి ఆవజాన ఆడ నిలబడేతలికి శాస బిగిసి గుటకమింగాడు బసవాయి.

"ఒరేయ్?" మల్లీ అంది ఎంకాయి.

"ఆఁ?-" అన్నాడు మైకం తీరగని బసవాయి.

"ఏందిరా నువుసేత్తుండదీ?" అడిగింది. ఎంకాయి.

"ఎవురూ- నేనా?- అయితే ఏంలే-" అంటున్నాడు బసవాయి.

"అయితే ఏంలే అంటాడేం!-" అంది ఎంకాయి.

"కొత్తె పనిమీనుండాలే-" అన్నాడు బసవాయి.

"అబ్బో కొత్తె సెప్పగూడ్డట్టా ఆ పనేందో?" అంది ఎంకాయి.

"ఆఁ అదే అనుకుంటుండా-" అన్నాడు బసవాయి.

"అబ్బో మాటలు నేర్చావే నాయనా! యాడకి పొయినాయ్యా యిన్నాల మించీ" అంది ఎంకాయి.

"ఎటో పోయినాలే-"

"చరే, యిగనేం-" పళ్లిక కిందపడేసి కూకుండది ఎంకాయి.

"నీతో నా కేందుకొచ్చింది, యివకాడ సానా పనుండదినాకు," అన్నాడు బసవాయి. ఏం పట్టించ్చుకోనట్టు పుట్టకాడ తిరుగుతూ.

"ఎవురొద్దన్నారూ, వుంటే చేసుకో రాదూ?" అంది ఎంకాయి,

"అసలు నువు యిటు ఏం పనిమీద వొచ్చినట్టూ?" అన్నాడు బసవాయి పాంబొక్కలోకి తొంగి సూత్తూ.

"ఒరేయ్, ఒరేయ్ ఏందిరా నువ్వాడ తొంగి కూసేదీ?" అంది ఎంకాయి వుండబట్టలేక.

"పాములే-" అన్నాడు బసవాయి అటనే తొంగిసూత్తూ.

"పాములే! ఎందుకురా పామును తొంగి సూట్టం? అవి మంచివి కాదంటరా!" అంది ఎంకాయి,

"పనివ్వుందిలే." అన్నాడు బసవాయి.

"ఏం పనిరా కొత్తెసెప్పవంట్రా?" అంది ఎంకాయి.

"పామునుపట్టుకుంటున్నాలే."అన్నాడు బసవాయి.

"ఆఁ, నిజంగా నట్రా! పోరా నీ బడాయిలు నాకాడంట్రా! నీలాంటోళ్లు యింగా పదిజనమలెత్తాల పామును పట్టుకుంటానికి." అంది ఎంకాయి.

"బడాయిలా? చూస్తావా మరీ పడ్తానో లేదో? హుఁ యీ బసవాయంటే అంతేననుకుండావుగావాల్సు,"

"యిగచాల్లే యివకాడికిరారా, పెద్ద పామును బట్టేమొగోడివి నేటిగ్గాంగా బయల్దేరావుగానీ. సానాసూశాం యిట్టాటోళ్ళని. ఒరేయ్ ఎండ్రకాయలు పట్టుకోక ఎందుకొచ్చిందిరా నీ కాపనీ?" అంది ఎంకాయి.

"నువు సూశావా నే ఎండ్రకాయలు పట్టటం?"

"సూశానా యింగా సూశానా! హుఁ, నాకు తెలవక పొద్దిగా నీ సంగతీ," అంది ఎంకాయి.

"ఏందమ్మో నీకు దెల్చిందీ? కాపలుగదూ నేను పట్టుకునేదీ? కావాలంటే ఎల్లి అడుగు ఎవుర్నయినా."

"ఒరేయ్, సిన్నప్పుడు నువు ఎండ్రకాయల్ని పద్దాకా గెడ్డలు దీసుకుని కొట్టేవోడివి గావంట్రా?" అంది ఎకాయి.

"సిన్నప్పుడు నీకు తేలు కొండెకి మల్లే జడ వుండేదంటనే యిప్పుడది యాడకి పోయిందమ్మా?"

"ఓ బసవాయోవ్ నా చంగతెరగవు తెల్చిందా?"

"మరి యింకేం, అటనే అనుకోరాదూ నేనుకూడా. హుఁ, అంతలావు ఎగతాళిగా వుండదిగా!"

"అబ్బో మాటలు సానా నేర్చావే!"

"హుఁ, ఆడ నీకే మాటలొచ్చింది. నీకన్న యీడ ఎవురేం తక్కువ తిన్నా- నాతో నీకెందుకొచ్చిందిగానీ యివకాడ సానాపనుండది నన్ను పలకరిచ్చమాక." అని మల్లీ పాంబొక్కలోకి తొంగిసూత్తుండాడు బసవాయి.

"ఒరేయ్,ఒరేయ్ బసవాయ్?"

"ఏం?"

"ఎందుకురా నీకు పాములజోలీ? అవి ఎసువంటివో నీకు తెల్చా?"అంది ఎంకాయి

"హుఁ, యీ బసవాయికి అన్నీ తెల్సు, యియ్యాల నైద్దికంలోకి గరగళం తెచ్చితే అర్ధరూపాయి డబ్బులిత్తా నన్నాడు రాంబెమ్మయ్య." అన్నాడు బసవాయి.

"గరగళం! గరగళంఏందిరా?"

"తాచుపాం గరగళం." అన్నాడు బసవాయి.

"తాసుపాం యిస మంట్రా! ఓమ్మో, అందుకంట్రా యీడ నువు తిరుగుతుండదీ?"

"బలే తాసుపాము లుండాయిలే యీడ!" అన్నాడు బసవాయి.

"గెట్టిగా అరవమాకరా! నీకు నిజంగా శాతనవునంట్రా ఆట్ని పట్టటం?"

"హుఁ, అదొక లెక్కా జమా! మా అయ్యోళ్లు ఆట్ని మిడతల్ని పట్టుకున్నట్టు పట్టుకుని, నడిబజాట్లో ఆట్ని మొల్తాళ్లుకట్టుకుని తిరిగేవాళ్లు!" అన్నాడు బసవాయి.

"ఆళ్లు పెద్దోళ్లురా. ఆళ్లు ఏం చేసినా చెల్లుద్ది. ఆళ్ళకాడ మంత్రకట్లుండే వంట."

"అంతావుత్తది. వుత్తధైర్నంమీద పట్టాల్సిందే ఎవురుపట్టినా."అన్నాడు బసవాయి

"నీకు ధైర్నం వుండదంట్రా?"

"ఎవరికి- నాకా? వుందో లేదో యిప్పుడు తెలుసుద్దిగా." అన్నాడు. బసవాయి.

"అద్దరూపాయి డబ్బులంట్రా రాంబెమ్మయ్య యిచ్చేదీ?" అంది ఎంకాయి.

"ఆడు అంతకన్నా యిచ్చిసావడు. సచ్చినోడి పెళ్లికి వొచ్చిందే సాలు."

* * *

"పానంకన్నా తీపంట్రా అద్దరూపాయీ? అసలు తాసుపాం ఎంత సెండాలపుదో నీకు తెల్చా? రాంబెమయ్య నిన్ను మాయ సేత్తుండాడ్రా." అంది ఎంకాయి.

"ఇదిగో ఎంకాయోవ్, అద్దరూపా యిలో నీకు పావలా బిళ్లయిత్తా." అన్నాడు బసవాయి,

"సీ పాడూ - నాకేం అక్కర్లే ఎదవ డబ్బు-"

"నువు సిన్నప్పుడు ఓనాడు మనంకోతి కొమ్మిచ్చాట ఆడుకుని యింటికి తిరిగొత్తా వుంటే సింతలతోపు కాడ నన్ను సాటుగా పిలిసి ఓ పావలా బిళ్ల సంపాయిచ్చుకు రామంటివే?" అన్నాడు బసవాయి.

"అప్పుడంట్రా! పోరా నీ దంతా! అపుడు సెంచయ్య కొట్టోకి సబ్బిళ్లలొత్తేనీ- ఆశబుట్టిందిరా- సీ పాడూ! అదెప్పుడో సిన్నప్పుళ్లేరా. ఇప్పుడు సబ్బిళ్లరుద్దుకుంటే మా జేజి సంపుద్ది." అంది ఎంకాయి.

అప్పట్నుంచీ ఎప్పుడిద్దా మనుకుండా ఓపావలా బిళ్లన్నా సిక్కకుండా వుందే ఎంకాయ్" అన్నాడు బసవాయి.

"పోనీలేరా ఎదవ పావలాబిళ్లా-"

"ఆఁ, అంతేనా! డబ్బంటే అంతసుల కనగా తోసెయ్యమాకేవ్. యిగ్యాల బెమ్మ దేవుడు దిగొచ్చినాచరే ఆ రాంచెమ్మయ్య దగ్గిర్నుంచి అద్దరూపాయిబిళ్ల రావాల్సిందే నువు మాట్టాడమాక -!అంటా పాంక్రా కొబ్బరిసిప్పా గట్టిగా పట్టుకుని పాంపుట్ట కాడ కూకుండాడు బసవాయి.

"బసవాయ్?" పిలిసింది ఎంకాయి.

పాంక్ర వూత్తా నాగస్వరంపాట మైకంలో పడ్డాడు బసవాయి.

యాడా సలీ సప్పుడు లేదు. దూరాన గొర్ర పిల్లకాయలు బిల్లంగోడు కొట్టుకుంటూనే వుండారు. నాగస్వరానికి నిలబడి ఆడ్తుంటె తాసు పాములకిమల్లే నిటారుగా నిలబడుండె తాడిసెట్లు గాలికిసల్లగా అటిటు కదు లాడ్తుండయి.

బసవాయి మాట యినిపిచ్చుకునే ట్లులేదు. యీడికి యిగ్యాల యిట్టా బుటిందేం? యీడు సిన్నప్పుడే నయం. కోతికొమ్మిచ్చాట బలే అడేవోడు. ఎదవసచ్చి నోడు ఒక్కపాలన్నా నన్ను దొంగను సేసే వోడు కాదు. మాలావు నాకేస్టా ఆ మాత్రం ఆట శాతకాందే? ఆ పిచ్చాయోళ్లు బసవాయి నన్ను గొంగని సెయమని ఒకటే మయిన ఏడ్చేవోళ్లు, సీ పాడూ, ఆళ్ల దెప్పుడూ ఎదవ బుద్దేగందా! యిగ యిప్పుడేం వుండెది? బసవాయి ఆటల్లో కలవటమే మానేశాడు. ఎప్పుడు సూసినా ఏ డొంక ములుపుల్లోనో తిరుగుతా వుంటాడు. యీ మద్దె యీడికి మనుసులంటేనే పట్టంలా. మనుసు లేం కరుత్తారా దగ్గిర కొత్తే? పావలాబిళ్ల యింకా గాపకం పెట్టు కుండాడే! ఎవురికేం అక్కర్లా- ఆడిత్తానన్నా అక్కర్లా. సీ- డబ్బులడగటమేంగి పాడూ! అప్పుడెప్పుడో అడుగుతే యింకా గాపకంపెట్టు కుండాడే! నామీద ఆడికి నిజంగా గురివుండదా? ఏం పాడో...... యీడికే వన్నా గాలి పట్టలేదు గందా? రాంబెమ్మయ్య అద్దరూపాయి డబ్బులకి తాసు పాన్ని పట్టకుని యిసం పిండుతాడంట. యీడి అయ్యోళ్లుకూడా యింతేనంట. యింకేం యీడూ తయారయ్యాడూ! అద్దరూపాయ్! ఆ డన్నట్టు అద్దరూపాయంటే మాటలా! ఆ అద్దరూపాయుంటే ఏం కొన్నా కొనచ్చు- అయితేమటుకూ? పాములన్నా పట్టానంటం? పెమాదంగాదూ? ఒకోపాలి- సీ అనగూడదుగానీ- పానాలు గూడా పోతయి...అస లవి మనుసులుండే సోటికి అంతసులబంగా రావంటనే! యీడెంత పాంక్ర వూదుకున్నా అవి రాకుంటే సరి. అసలా పుట్టలో పాముండదో లేదో. వుంటే యింతసేపు రాకుండా వుంటదా? ఒకేళ అది బయిటికి వొత్తే యీడికి దాన్ని పట్టడం సరిగా శాతకాకపోతే? యింకా ఏమన్నా వుండెదీ- "ఒరేయ్ బసవాయ్ యిగ సాల్లే రారా?" అంది ఎంకాయి.

బసవాయి ఎప్పుడో నాగలోకానికి పొయ్యాడు. ఎంకాయి యీడ కూకుండదని ఆడికి అసలు తెలవదు. పాంక్ర వూత్తా అటనే వూగుతుండాడు బసవాయి.

ఎంకాయి కళ్లు మెరిసినై- ఒక్కపాలి ఎనిక్కి యిగసుకుపడ్డది ఎంకాయి. పుట్ట లోంచి తలతలతల మెరుస్తా జలజలజారి దొసెడు పడగిప్పుకుని బసవాయి ముంగల తోకమీన నిలబడి వూగుతా ఆడ్తుండదా తాసుపాం. అటనే సెలకు నీలుక్కు పోయింది ఎంకాయి.

నిశిరేత్రి మెరుమెర్రిసి డామ్మని పిడుగు పడ్డట్టు-తాసుపాం తన ముంగల నిలబట్టం సూశాడు బసవాయి. ప్రాక్ర వూత్తానే- ఒక్కపాలి కళ్లు మూసుకుండాడు బసవాయి. బసవాయి గుడ్లల్లో ముళ్లు పొడిసినట్టు సూసింది తాసుపాం. ఒళ్లు[illegible]డిసింది బసవాయికి. మెడతిప్పి ఎనిక్కి తిరిగి సూశాడు- యిగహానికి మల్లే నీలుక్కు బోయి గుడ్లిప్పుకుని సూత్తుండెది ఎంకాయి. మెడ బిగిసింది బసవాయికి.

సల్లగా సెయి ఒనుకుతా- పాంక్ర తాసుపాం పడిగ మీనకి పోనిత్తుండె బసవాయికి మద్దెలో నరాలు పటపట బిగలాగ టాన పట్టుదప్పి ఎనిక్కి తూలిన తూల్లం ఎగిరెగిసి గంతేసి పుసిమీన ఎల్లి ఎంకాయి సెయి పట్టుకుని తాడితోపులోంచి బెయిటికి అదేమయిన లగెత్తాడు.

"యదవ సచ్చినోడా - పానం తీశావు గదంట్రా - యిదూ సెయ్యి-" అంది ఎంకాయి రొప్పుతూ.

"అరవమాకే-" అన్నాడు బసవాయి తాడితోపు కల్లి బిత్తరసూపులు సూత్తా.

"సెపితే యిన్నావంట్రా. ఒరేయ్ ఎక్కడ కాయలు పట్టుకోక ఎందుకొచ్చిందిరా నీకీపనీ-" అంది ఎంకాయి టపీమని కళాపి గొట్టినట్టు.

* * * *

ఆయాల్టినుంచి బసవాయి ఎంట పడింది తాసుపాం. పులిస్తరాకు లెగుస్తే తాసుపాం లెగుస్తున్నట్టుంటున్నది బసవాయికి. ఎవురన్నా గబగబ మాట్టాడుకుంటుంటే బసవాయి ఎంటికలు నిక్కబొడుసుకుంటుండై. నూతిలో తాడు, రోడ్డుమయాన, రోడ్డుపక్క తాళ్లను సూసి ఎనిక్కి ఎగ్గిరి గంతేసి యీపు పరుసుకుంటుండాడు బసవాయి. కలలు కన్నాడు బసవాయి. గోడమొత్తలకాడ, గుడిసె సూరు సందుల్లో, శాంతాడు సుట్టమయాన తనను సూసి తాసుపాం 'బస్సు' మంటా పడిగ ఎనిక్కి తీసుకోటం ఎన్నోసార్లు కల్లోసూశాడు బసవాయి. తమాసా! ఓ నిశిరేత్రి ఎంకాయి తాసుపాముకు మల్లే 'బుస్సు' మంటం సూశాడు బసవాయి.

కొన్నాలకి ఓనాడు సందేల గొడ్డమందతో యింటికి తిరిగొత్తా తాడితోపులో ఆపుట్టకాడ గెడక్రకి మల్లే తాడిసెట్లలో కలిసిపోతా ఎవురో నిలబడుంటం మసగ్గా సూసింది ఎంకాయి. ఒక్కపాలిగా నిలిసి పోయింది ఎంకాయి. ముందుకుపోను ఎంకాయికి కాలాడలా సల్లగా మందనించి ఎనిక్కనిక్కి తగ్గి తాడితోపు కాడికొచ్చి సూసింది ఎంకాయి. నిజంగా ఆ పుట్టకాడ ఓ మడిసి నిలబడుండాడు. బసవాయి కాదు గందా? యిదేంది యీడికేవన్నా గాలి బట్టిందా: యీ యాలప్పుడు ఒంటరిగా ఆడ నిలబట్టానికి ఎంతదైర్నంవుండాల?

మసగలో తడువుకుంటా పుట్టకాడికొచ్చి- ఒక్కపాలికేక బెట్టి అటనే నోరు దెరిసి కొయ్యకి మల్లే నిలబడిపోయింది ఎంకాయి.

ఆ తాసుపాం బసవాయి మెడా, సెయీ బిగదీస్తుంటే, దాని మెడకాడ పట్టుకుని గొబ్బరి సిప్పలోకి దాని యిసం పిండుతుండాడు బసవాయి.

దైర్నంగల మొగోడు గుండె బిగువు మీన డెబ్బయి గెజాల ఎత్తయిన దొజత్తంబం

మీనకు ఒక్కొక్క జరుగే జరుక్కుంటా ఎల్తుంటే యవదానంలో ఒకొడెగూతురు గుండె బెడిసి ఒక్కపాలికేక పెట్టేతలికి అంత దైర్నంగల మొగోడి గుండెబిగువూ కుంప పగిల్నట్టు పగిలి, నరాల పట్టుతప్పి సెవటలు గక్కుతా గిరగిర తిరుగుతా దెబ్బకు బూమ్మీన పడ్డాల్సిందన్న మాట!

గబిక్కున ఎనక్కి తిరిగి సూశాడు బసవాయి వూపిరి బిగబట్టి.

"ఎళ్లు-" అన్నాడు బసవాయి దవడలు కొరుక్కుంటా.

"ఓమోర్-" మూలిగింది ఎంకాయి.

పొట్టలిచ్చిన పత్తికాయలకి మల్లే ఎంకాయికళ్లు బసవాయిగుండెలమీనదిగినై.

"ఎల్లిపో- మళ్లీ ఎందుకొచ్చా యీడకీ? నా సెయి జారుతుండది-ఎల్లిపో అరవకుండా-"

"అరవన్నేరా- ఒరేయ్- ఒరేయ్- నిన్ను సంపుద్దిరా- దాన్ని సంపరా-" మూలిగింది ఎంకాయి.

తాసుపాంకల్లి సూశాడు బసవాయి. తాసుపాం రకతం గక్కుతా పటపట గొబ్బరి సిప్పను కొరుకుతా వొనుకుతుండ సెయి సుట్టూ మెల్లిరుగుతుంటే- ఒక్కపాలి గట్టిగా నరాలు బిగబట్టి, ఎంకాయి కల్లి కొరకొర సూత్తా సువ్వకి మల్లే మెల్లిరిగి వుసిమీన తాడిసెట్ల సీకట్లోకి గబాగబా లగత్తు కెల్లాడు బసవాయి.

మరుస నాట్నుంచి జరంలో మతుండక మంచంలో పడుండాడు బసవాయి. "వాడికేం రాయిలాంటి మనిషి." బసవాయికేం ఫరవాలేదన్నాడు ఎంకాయితో వైద్దికుడు రాంబెమ్మయ్య.

కొన్నేళ్లు గడిసినాక ముగ్గురు బిడ్డల్తో పుట్టింటికి తిరిగొచ్చిన ఎంకాయిని తాడితోపుసాయల్న "ఏం ఎంకాయమ్మోవ్?" అని బసవాయి పలకరిచ్చేదాకా బసవాయిని ఎంకాయి పోల్చుకోలేక పోతోంది.

"సంపావు గదంటయ్యా బసవయ్యా! పోల్సుకోనే లేకబోతినే నా తెలివి పాడుగానూ! బాగుండావంటయ్యా? బొత్తిగా గురుతు పట్టకపోతినే!" అంటా బసవాయిని యిశారించింది ఎంకాయి.

"చకే, పెగ్గోణ్ణయిపోటంలా! నీకుముగ్గురు బిడ్డలంటగా బాగుండారా?" అన్నాడు బసవాయి.

"ఆ, బాగుండారయ్యా బసవయ్యా. పెద్దోడిపేరు ఆళ్లతాతపేరు పెట్టుకుండారూ, రెండోవాడిపేరు ఎంకటేశ్వర్లు, మూడోదాని పేరు చీతాం." అంది ఎంకాయి.

"నువ్వూ కొత్త పెద్దదానివయినా మడిసివి అంతగా మార్లేదులే." అన్నాడు బసవాయి పక్కకి తిరిగి వుమ్మేస్తా.

"ఏబ్బె, అదేందయ్యా యింగా పెద్దదాన్ని కాలేదంటావు ముగ్గురు బిడ్డలయితేని! యింగా నయం! నువు పెద్దోడివయ్యావు. సానాసన్న బడ్డావు." అంది ఎంకాయి.

"కొత్త మద్దెమద్దె వొల్లు సెడ్డావొచ్చిందిలే- సానా ఏళ్లుకాలా మరీ-" అన్నాడు బసవాయి.

"సానా ఏళ్లయింది." అంది ఎంకాయి.

"అంతా నిన్న మొన్న జరిగినట్టుంది." అన్నాడు బసవాయి.

దూరాన గొడ్డు ఆ డీడ గనువు లెంట తిరుగుతుంటే గొడ్డపిల్లకాయలు బిల్లంగోడు ఆడుకుంటుండారు

"బలే బతుంబుట్టింది." అంది ఎంకాయి.

"నువు కోక పైకెగ్గట్టుకుని ఎనిగిత్తే వొచ్చి ఆడ నిలబట్టం యింగా కల్లల్లో మెదుల్తుండది." అన్నాడు బసవాయి.

"ఎట్టా పట్టుకుండా ఆ తాసుపాముని- సివరకి ఏం జేశా దాన్ని? నువామయిన లగెత్తుకు పొయినాక అడలుబుట్టి సచ్చా. యీడజూసినా అగుపించలానువ్వు."

"ఆ మూలకిపొయి, దానియిసం పిండి తల నేలకేసి రుద్దిరుద్ది సంపేశా," అన్నాడు బసవాయి.

"ఓమో!" అనరిసింది ఎంకాయి.

"అదిగో- ఎంకాయోవ్-"

"బలేబయం పుట్టిందిరా బసవాయ్-"

"సంపేత్తివి గదంటే ఎంకాయ్-"

"అదేంది బసవయ్యా ఎనకటికిమల్లే ఒరే, ఒరే అంటుండానూ- చీ, సచ్చిందాన్ని- యిదేంమడిసినీ- యిహీ, యిహీ-" అంటా ఎంకాయి నవ్వితే బసవాయీ నవ్వాడు "అంటే అన్నావులే" అంటూ.

"సివరికి రాంబెమ్మయ్య ఆల్సెం అయిపొయిందని గరగళానికి అడ్డరూపాయి బిల్లయీయనే యీయలేదుగా." అన్నాడు బసవాయి.

"అరి యీడిజిమ్మడా- నిజంగా యీయనే యీయలా?" అంది ఎంకాయి.

"అబ్బే నీతోడు యీయనే యీయలేదుగా. యిత్తేనీకు పావలాబిల్ల ఎప్పుడో యీయక బొయ్యేవాణ్ణా!" అన్నాడు బసవాయి.

"అదేంది బసవయ్యా యింగా పావలా బిల్లంటుండావూ-?"

"అంటేఏంలే. మాటన్నాక యీయకనే బోతినిగా."

"పోనీలే బసవయ్యా- అందరూ బాగుంటే అంతేసాలు."

"అంతేలే ఎప్పటికయినా-" అన్నాడు పక్కకుతిరిగి వుమ్మేస్తా.

"మా పిల్లల్ని సూశావంటయ్యా బసవయ్యా?"

"ఏదీ నువు సూపియ్యక నే బోతినిగా."

"బలేవోడివిలే! ఆనక మాయింటికొస్తే తప్పెట్టా?" అంది ఎంకాయి నవ్వుతా.

"ఓ బసవయ్యోవ్, ఓ ఎంకాయమ్మోవ్ కొత్త ఓ పాలియిటొచ్చి పోండయ్యా మీ మడుసులు బంగారంగానూ?" అని ఒక్కపాలరిశారు బిల్లంగోడుకాడ తగువొచ్చిన గొడ్డ పిల్లకాయలు.

నారసింహ లేహ్యము

బంగారు చేర్చబడినది. మేహము, నికొక్క, నిస్సత్తువ శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

తు|| డబ్బి రు. 3-4-0 పోస్టేజి 10 అ.

పి. సి. ఏ. ఫ్ఞకంపెని "ఆయుర్వేదసమాజం"

పెరిదేప- నెల్లూరు జిల్లా.

కాశ్మీర్

అన్నిదగ్గులకు అమోఘమైనది

గిరిజా & కో. రాజమండ్రి